చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

- పేదల ఇళ్ల స్థలాలపై కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు
- బొండా ఉమకు ఓటడిగే అర్హత లేదు
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు


పండ్ల వ్యాపారులతో ముచ్చటిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల స్వంత ఇంటి కలను అడ్డుకున్న చంద్రబాబుకు గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 26వ డివిజన్ మారుతీనగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామ, నాగేశ్వరరావుతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. దారి పొడవునా మహిళలు, పలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ, పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్న రుణం కొంతవరకైనా తీర్చుకుంటామంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఇక్కడ గెలిచిన స్థానిక కార్పొరేటర్ డివిజన్ అభివృద్ధిని గాలికి వదిలేశారని విచారం వ్యక్తం చేశారు. తాము ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్నామని, తాము చేసిన మంచిని చూసి ఓటు వేయమని అడుగుతున్న ఏకైక రాజకీయ పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని అన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

పేదల స్వంత ఇంటి కలను సాకారం చేసేందుకు అమరావతిలో ఇళ్లు ఇస్తే చంద్రబాబు, టీడీపీ నేతలు అడ్డుపడ్డారని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పేదల ఇళ్ల విషయంలో బహిరంగ చర్చకు రావాలని వెలంపల్లి సవాల్ విసిరారు. తాము అడ్డుకోలేదని, కోర్టులో స్టే వేయలేదని చంద్రబాబు, బొండా ఉమా ప్రజల మధ్యలో ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు ఎన్ని స్టేలు తెచ్చి అడ్డుకున్నా తాము పేదలకు అమరావతిలో ఇళ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు.

అబద్ధాల కోరు బొండా ఉమా...

అధికారంలో ఉండగా ప్రజల సమస్యలను గాలికి వదలివేసిన బొండా ఉమా పచ్చి అబద్ధాలకోరు అని వెలంపల్లి శ్రీనివాసరావు దుయ్యబట్టారు. ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకోవటంతో పాటు ఇళ్లు క్యాన్సిల్ చేశారంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేకపోగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని సైతం అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడ్కో ఇళ్ల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

టిడ్కో ఇళ్ల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసింది బొండా ఉమా, తెలుగుదేశం పార్టీ అని వెలంపల్లి అన్నారు. తాము పారదర్శకంగా లక్షలాది మంది స్వంత ఇంటికలను సాకారం చేశామని చెప్పారు కార్యక్రమంలో 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెలంపల్లి గెలుపు కోరుతూ వాంబే కాలనీలో ప్రచారం


ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. వాంబే కాలనీలోని పలు బ్లాకుల్లో పర్యటించి స్థానిక ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోదిగింటి నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వాంబేకాలనీ వంటి నిరుపేద ప్రజలు నివసించే ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందాయని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి పనులే మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపునకు దోహదపడతాయని, వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల దుర్గారావు, బాబు, మస్తానయ్య, కోడూరు గోపి, అన్నపురెడ్డి, డేవిడ్ రాజు, సౌజన్య, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

8న శివపార్వతుల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వతేదీ శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచే నీలకంఠేశ్వరస్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. లింగోద్భవ కాలంలో రాత్రి 9 గంటల నుంచి గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, తదుపరి శ్రీ శివ పార్వతుల కల్యాణ ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆపాత మధురాలు సంగీత కార్యక్రమం సినీ క్లాసికల్ విశిష్టతను చాటింది. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం లాంటి సంగీత కళాకారులు అరుదుగా కనిపిస్తారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాస్టారని, బాలసుబ్రహ్మణ్యం వివిధ భారతీయ భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపించారు.

రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయం


రమాశంకర్, జిలానీఖాన్ సంస్మరణ సభలో పాల్గొన్న కళా సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సినీ నిర్మాత, దర్శకుడు ఒమ్మి రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయమని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్మాత దర్శకుడు ఒమ్మి రమాశంకర్, కళాపోషకుడు జిలానీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ రమాశంకర్ దర్శకునిగా యువ నటులు కొందరిని తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐఓసీ అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ రమాశంకర్ నగరానికి వచ్చిన అనతికాలంలోనే గాయనీ గాయకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ తన మురగా చారిటబుల్ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేశారని, నిర్మాత, దర్శకత్వం వహించిన అరణ్య సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సంస్మరణ సభలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మారేపల్లి జోషి, కారుమంచి రాజు, శ్యాంప్రసాద్, దామోదర గణపతిరావు, సింగంపల్లి రమణ, కొప్పుల ఆనంద్ తదితరులు రమాశంకర్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు కళాకారులు, వివిధ సంస్థల ప్రతినిధులు రమాశంకర్ చిత్రపటానికి నివాళి సమర్పించారు.

నిరంతర సాధనే విజయానికి సోపానం


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: నిరంతర సాధనే విజయానికి సోపానమని రాగలహరి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు బి.మీరాకుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద మృదుమధుర సంగీతం –సినీ సంగీత వైభవం పేరుతో మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మీరాకుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు పంచ సూత్రాలను పాటించాలని, చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, సాధన, సంగీత సాహిత్యాల పట్ల మమకారం ఉండాలన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పరుచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి సంస్థ చేస్తున్న సంగీత సేవలను వివరించారు. గాయని మల్లాది స్వాతి ఆధ్వర్యంలో అయ్యప్పన్, వడ్డాది సూర్య కామేశ్వరి, నాయక్, షబానా, రూపశ్రీ, తెలుగు, హిందీ, భక్తి గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మద్యం మత్తులో బంధువులపై కోడికత్తితో దాడిచేసిన నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను శుక్రవారం గుణదల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే గుణదల మురళీనగర్‌కు చెందిన మారంపూడి రాజేష్‌తో పాటు అతని చిన్న కుమారుడు అఖిలేష్, తమ్ముడు ప్రశాంత్‌లను వరసకు సోదరుడు అయిన ప్రేమ్‌కుమార్ బుధవారం రాత్రి కోడికత్తితో దాడి చేశాడు. బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గుణదల పోలీసులు విచారణ ప్రారంభించారు. శుక్రవారం నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ముస్లిం మైనార్టీలంటే ప్రేమ ఇదేనా ‘బొండా’!

- టీడీపీ సమావేశంలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం
- కనీసం సమావేశ వేదికపైకి పిలవని వైనం
- బయటకు వచ్చి వేరుగా సమావేశమైన ముస్లిం నాయకులు
- అక్కడ కేవలం ఒక వర్గానికి, జనసేన వారికి మాత్రమే ప్రాధాన్యం
- తమను అవమానించిన వారికి గుణపాఠం చెబుతామని ముస్లిం నేతల హెచ్చరిక


టీడీపీకి, బొండా ఉమాకు వ్యతిరేకంగా సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు


ముస్లిం మైనార్టీలను పిలవకుండా వేదికపై మాట్లాడుతున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం జరిగింది. ఆ పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సింగ్‌నగర్ ఫ్లైపులరోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో వేదిక పైకి నియోజకవర్గంలోని ప్రధాన నాయకులందరినీ పిలిచి కూర్చోబెట్టుకున్నప్పటికీ ముస్లిం మైనార్టీ నాయకులను మాత్రం వేదికపైకి ఆహ్వానించలేదు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ముస్లిం మైనార్టీ నాయకులంతా కార్యక్రమం జరుగుతుండగానే అక్కడి నుంచి బయటకు వచ్చేసి సింగ్‌నగర్‌లో వేరుగా సమావేశమయ్యారు. ఈ సన్నివేశాన్ని చూసిన వారంతా ముస్లిం మైనార్టీలపై నీకున్న ప్రేమ ఇదేనా బొండా ఉమా అంటూ ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేటర్ స్థాయి లేని వారిని కూడా...

టీడీపీ సమావేశంలో కనీసం కార్పొరేటర్ స్థాయి లేని వ్యక్తులను కూడా పిలిచి వేదిక పైన కూర్చోబెట్టుకున్నారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముస్లిం మైనార్టీలను మాత్రం వేదికపైకి పిలవకపోవడం చాలా బాధగా ఉందని టీడీపీలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఆది నుంచి ముస్లిం మైనార్టీలంటే టీడీపీ పెద్దలు చులకనగా చూస్తున్నారని, ఎన్ని అవమానాలు ఎదురైనా వాటిని భరించి ముందుకు వెళ్తుంటే ఈరోజు ఇతర వర్గాల వారి ముందు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ముందు తమను ఘోరంగా అవమానించారంటూ అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది కావాలనే ముస్లిం మైనార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇన్ని జరుగుతున్నా అధిష్ఠానం పట్టీపట్టనట్లు చూస్తుందే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ముస్లిం మైనార్టీల పవర్ అంటే ఏంటో వారికి కచ్చితంగా అర్థమయ్యేలా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఖర్చు పెట్టుకున్నవారికి.. కష్టపడిన వారికి విలువలేదా?

గత ఐదేళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతూ, పార్టీ కార్యక్రమాలకు తమ సొంత డబ్బులను వేసుకుని చేస్తున్న నాయకులను కాదని బొండా ఉమా ఇప్పుడు కొత్తగా వచ్చిన వారికి విలువ ఇవ్వడం బాధాకరంగా ఉందని ముస్లిం మైనార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా పోటీచేయని వారిని, పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కనీసం ముందుకు రాని వారినందరినీ వేదికపైకి ఎక్కించి పూలదండలు, శాలువాలు కప్పుతుంటే మాలాంటి నిజాయితీ గల ముస్లిం నాయకులు వేదిక కింద కూర్చోవాలా అంటూ కలత చెందారు. నిన్న కాక మొన్న వచ్చిన జనసేన నాయకులకు ఇచ్చిన విలువ కూడా పార్టీలో తమకు ఇవ్వడం లేదని, ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న టీడీపీకి, బొండా ఉమాకు పనిచేసేది లేదంటూ కొంతమంది మైనార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ముస్లిం నాయకులమంతా సమావేశం నిర్వహించుకుని తమ భవిష్యత్‌కు ఉపయోగపడే నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు.

పింఛన్‌తో అవ్వాతాతలకు కొండంత భరోసా

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని విధంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ కండ్రిక కట్ట రోడ్డులో శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. చంద్రబాబు పాలనలో కొత్త పింఛన్ మంజూరు కావాలంటే అవ్వాతాతలు పడిన పాట్లు వర్ణనాతీతమని ఈ సందర్భంగా మల్లాది విష్ణు గుర్తుచేశారు. జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, పింఛన్ అందుకునేందుకు రోజుల తరబడి పడిగాపులు పడుతూ, చాంతాడంత క్యూలో నిలబడలేక నరకయాతన అనుభవించేవారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక పింఛనుదారులకు చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతి నెలా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అందిస్తున్నారన్నారు. పింఛన్ అర్హతను 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు అందేవని, కానీ ఈ ప్రభుత్వంలో 65.92 లక్షల మందికి నెలకు రూ.1,958 కోట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు అధికమన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 17వేలు మాత్రమే ఉన్న పింఛన్లను 26,758 కి పెంచి ప్రతి నెలా రూ.8 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. 64వ డివిజన్ కి సంబంధించి 2,013 మందికి ప్రతినెలా రూ.60.30 లక్షల పింఛన్ మొత్తాన్ని ఠంచనుగా ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏటా రెండు పర్యాయాలు నూతన పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా విప్లవాత్మక రీతిలో మన రాష్ట్రంలో కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రముఖ సంస్థ స్కోచ్ ప్లాటినం అవార్డును సైతం ప్రకటించినట్లు మల్లాది విష్ణు చెప్పారు. పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబుకి ఎక్కడా పోలిక లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న కార్పొరేటర్ కుక్కల అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. గిరిపురంలో శుక్రవారం పింఛను పంపిణీ కార్యక్రమంలో వలంటీర్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారని, కానీ నేడు జగనన్న ప్రభుత్వం అవ్వాతాతలకు మొదటి తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తుందన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ప్రజలను పట్టించుకోని వారు, ఇప్పుడు వచ్చి ఏవో చేస్తానని మాయమాటలు చెపుతున్నారని, వారిని నమ్మవద్దని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని నాలుగు సచివాలయాల పరిధిలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

సెలూన్ నిర్వహణ, సంగీత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య


సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య. చిత్రంలో భీమశంకరరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి తరానికి అనుగుణంగా ఆధునిక సెలూన్ నిర్వహణ నిమిత్తం తిరుపతిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో నాయీబ్రాహ్మణ యువత కోసం సంగీత శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం కార్పొరేషన్ బోర్డు మీటింగ్ జరిగింది. ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భీమశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ తొండమల్లు పుల్లయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన తీర్మానాలపై సమీక్షించామని తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ కర్పూరి ఠాకూర్‌కు ఇటీవల భారతరత్న పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో ఆయన జయంతి లేదా వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలన్న అంశంపై చర్చించారు. నాయీబ్రాహ్మణ సామాజికవర్గం అవసరాల కోసం తిరుపతిలో స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించానని పుల్లయ్య పేర్కొన్నారు.

7న సిద్ధార్థలో బ్లిట్జ్‌క్రీగ్-2024

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 7 వ తేదీన బ్లిట్జ్‌క్రీగ్-2024 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. బ్లిట్జ్‌క్రీగ్-2024 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం కళాశాలలో శుక్రవారం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ తమ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 2006 నుంచి బ్లిట్జ్‌క్రీగ్ పేరుతో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నిర్వహణ, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, బ్లిట్జ్‌క్రీగ్ సమన్వయకర్త కోనేరు సుధీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తంచన్‌గా పింఛన్ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్, రామలింగేశ్వర పేటలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమయింది. వలంటీర్ నాగమణి, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ రాంబాబు, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ తెల్లవారుజామున తలుపు తట్టి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన తలుపుతట్టి మరీ పింఛన్ అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పాయకాపురం రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 236 మంది విద్యార్థులకు గానూ 233 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధి లక్ష్మి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

రెడ్డి సామాజిక వర్గం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి

ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భవానీపురంలో రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరలా వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఓసీ యూత్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయం

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వస్తాయా....జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎప్పుడు చేద్దామా అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన చేస్తూ త్వరలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అడ్రస్ గల్లంతవడం ఖాయమని స్పష్టం చేశారు. మొన్న తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు ఆశించినంత జనం హాజరు కాకపోవడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నిరుత్సాహంతో నోరు అదుపుతప్పి మాట్లాడారని అన్నారు. పవన్ కల్యాణ్ చంద్రబాబుతో కలిసి సభ నిర్వహించడం వలనే కాపులు పాల్గొనలేదని తెలిపారు. జెండా సభ మొత్తం ఆత్మస్తుతి, పరనింద మాదిరిగా తయారయ్యిందని అన్నారు. ముఖ్యంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాట్లాడిన భాషను చూసి ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలే అసహ్యించుకున్నారని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చాలా మంది కాపులు వైఎస్సార్ సీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకువచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దెబ్బకు చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయిందన్నారు.

ధైర్యంతో ముందుకు సాగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగినప్పుడే విజయాలను అందుకుంటారని ప్రముఖ క్రీడాకారిణి ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్తి గీత అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల 16వ స్పోర్ట్స్ డే వేడుకలను శుక్రవారం కళాశాల ఆవరణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గడిచిన విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సత్తి గీత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు పాటుపడాలన్నారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో తమ విద్యార్థులు పలు బహుమతులను సాధించటం ఆనందంగా ఉందన్నారు. కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ ప్రసంగించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com